

## భారత్‌కు షాక్.. వరల్డ్‌కప్ నుంచి ప్రతీక ఔట్

స్వదేశంలో జరుగుతున్న మహిళల వన్డే ప్రపంచకప్‌లో సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు భారత జట్టుకు భారీ షాక్. ఫామ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ ప్రతీక రావల్ వరల్డ్ కప్‌లో నాకౌట్ దశకు దూరమైంది. ఆమె స్థానాన్ని షఫాలీ వర్మ భర్తీ చేయనుంది. ప్రతీక అరంగేట్రం తర్వాత సుమారు ఏడాదికాలంగా వన్డే జట్టులో చోటు కోల్పోయిన షఫాలీ.. తాజాగా ఆమె స్థానాన్ని భర్తీ చేయనుండటం గమనార్హం గ్రూప్ దశలో ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా ప్రతీక కుడి కాలికి గాయమైంది. మ్యాచ్ జరిగే సమయంలోనే ప్రతీకను వైద్య పరీక్షల నిమిత్తం దవాఖానాకు తరలించగా ప్రస్తుతం ఆమెకు మెరుగైన చికిత్స అందిస్తున్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రతీక లేకపోవడం జట్టు లయను దెబ్బతీసేదే. ఈ టోర్నీలో ఇప్పటిదాకా ప్రతీక ఆరు ఇన్నింగ్స్‌ల్లో 51.33 సగటుతో 308 రన్స్ చేసింది. భారత జట్టు గురువారం ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ ఆడాల్సి ఉంది.


నిజామాబాద్
మంగళవారం
28.10.2025

సంపుటి : 16 సంచిక: 30
పేజీలు: 8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

# చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక


## కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి
# ఎంపీ అరవింద్ పరామర్శ



**చట్టం:**

నగరంలో ఇటీవల రౌడీ షీటర్ రియాజ్ చేతిలో హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని ఎంపీ అర్వింద్ పరామర్శించారు. ప్రమోద్ పెద్ద కుమారుడికి ప్రైవేటు విద్యాసంస్థలో ఉచిత విద్య అందించేలా చూస్తామన్నారు. సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని ఎంపీ అరవింద్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణతో కలిసి ఎంపీ మాట్లాడుతూ.. కానిస్టేబుల్ ప్రమోద్ పెద్ద కుమారుడికి ప్రైవేటు విద్యాసంస్థలో ఉచిత విద్య అందించేలా చూస్తామన్నారు. ఇందుకు ఆ విద్యాసంస్థ కూడా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంపీ ఎమ్మెల్యే ఇద్దరు కలిసి రూ.2 లక్షల చెక్కులు అందజేశారు. రాష్ట్రంలో గన్ కల్చర్ పెరుగుతుందని, దీన్ని అణిచివేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం గన్ కల్చర్ ప్రోత్సహించకుండా చూడాలని కోరారు. అనంతరం రియాజ్‌ను పట్టుకునే ప్రయత్నంలో గాయాలపాలైన ఆసిఫ్‌ను పరామర్శించారు.

## రూ.2.25 కోట్ల జీతంతో గూగుల్‌లో ఉద్యోగం

**చట్టం:**



అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన సాత్విక్‌రెడ్డి గూగుల్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. న్యూయార్క్‌లో చదువుకున్న అతడు రూ.2.25 కోట్ల వార్షిక వేతనంతో జాబ్‌కు ఎంపికయ్యాడు. టెక్ దిగ్గజ కంపెనీ గూగుల్‌లో ఉద్యోగం సాధించాలని చాలా మంది కలలు కంటారు. అయితే కొందరు మాత్రమే సక్సెస్ అవుతుంటారు. అనంతపురం జిల్లా కు చెందిన ఓ యువకుడు ఏకంగా రూ.2.25 కోట్లతో గూగుల్‌లో ఉద్యోగం సాధించాడు.అనంతపురం జిల్లా తాడిపత్రి కి చెందిన వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేశ్‌రెడ్డి, అంబిక దంపతుల కుమారుడు సాత్విక్‌రెడ్డి న్యూయార్క్‌లోని స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. కాలిఫోర్నియాలోని గూగుల్ కంపెనీలో ఆయన ఉద్యోగం సాధించాడు. ఏడాదికి రూ.2.25 కోట్ల వేతనంతో తన కుమారుడు ఉద్యోగం సాధించినట్లు రమేశ్‌రెడ్డి తెలిపారు. దీంతో పట్టణంలోని పలువురు రమేశ్‌రెడ్డితో పాటు ఆయన కుమారుడికి అభినందనలు తెలుపుతున్నారు.అనంతపురం జిల్లా గుత్తి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దాదాఖలందర్ ఇటీవల రూ.51 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించిన విషయం తెలిసిందే.

# చదివిన స్కూల్‌కి కొత్త జీవం

- **తండ్రి ఆశయాన్ని సాకారం చేసిన కుమారులు**
- **మాక్లూర్‌లో బిగాల కుటుంబం విద్యాసేవా దృక్పథం దేశానికి ఆదర్శం!**

**చట్టం, నిజామాబాద్:**





తండ్రి కలను సాకారం చేస్తూ, తాత చూపిన మార్గంలో విద్యా సేవకు అంకితమైన కుటుంబం —— బిగాల కుటుంబం.తండ్రి పేరు మీద ఒక పాఠశాల... తాతగారి పేరు మీద మరొక పాఠశాల —— ఇవి కేవలం భవనాలు కాదు, భవిష్యత్తు తరాలకు వెలుగు నింపే విద్యా ఆలయాలు. మాక్లూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) ,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లకు సంబంధించి నూతన భవనాలను ఘనంగా ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, ఆయన సోదరుడు మహేష్ బిగాల, వారి కుటుంబ సభ్యులు తమ తండ్రి స్వర్గీయ బిగాల కృష్ణమూర్తి ,తాత స్వర్గీయ బిగాల గంగారాం జ్ఞాపకార్థంగా ఈ పాఠశాలలను నిర్మించారు.

**కోటీ రూపాయల విరాళం – కార్పొరేట్ స్థాయిలో పాఠశాల నిర్మాణం**

మహేష్ బిగాల మాట్లాడుతూ.. కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు NRI లు పాఠశాలలను దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నాం.ఆ పిలుపుకు స్పందించి, నేను మాక్లూర్ పాఠశాల పునర్నిర్మాణానికి కోటి రూపాయలు విరాళంగా ఇచ్చాను. ఇంతకు ముందు పాఠశాల శిథిలావస్థలో ఉండేది. అప్పటి ముఖ్యమంత్రి అభ్యర్థించి రూ.4.70 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా, మేము అదనంగా కోటి రూపాయలు, అలాగే మిగతా అభివృద్ధి పనులకు కోటిన్నర రూపాయలు వెచ్చించాం," అని పేర్కొన్నారు. "రాష్ట్రంలోనే అత్యుత్తమ పాఠశాలగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో, 26000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్పొరేట్ స్థాయిలో పాఠశాలను నిర్మించాం. విద్యార్థుల కోసం డైనింగ్ హాల్, టాయిలెట్లు, కంపౌండ్ వాల్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాం. మా తండ్రి విద్యపై ఉన్న మక్కువ మా రక్తంలో ఉంది. అదే మాకు ప్రేరణ," అని భావోద్వేగంగా చెప్పారు.

**తండ్రి ఆశయం – భవిష్యత్తు తరాలకు మార్గదర్శనం**

మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ .. "హైదరాబాద్ సంస్థానం విలీనం తర్వాత మా తాత బిగాల గంగారాం మాక్లూర్ గ్రామానికి తొలి సర్పంచ్‌గా సేవ చేశారు.ఆయనే ఈ పాఠశాల ఏర్పాటుకు పునాది వేశారు.తరువాత మా తండ్రి కృష్ణమూర్తి జూనియర్ కాలేజీ మంజూరుకు, నిర్వహణకు ఎంతో కృషి చేశారు.మా కుటుంబం తరతరాలుగా విద్యను సేవగా తీసుకుంది.ఈ రోజు మా తమ్ముడు మహేష్ తన కృషితో ఆ కలను సాకారం చేశాడు. మాక్లూర్ అభివృద్ధికి మా కుటుంబం ఎప్పుడూ ముందుండుతుంది, ఇది మా తండ్రికి చేసిన స్మారక వందనం," అన్నారు.

**విద్యను సేవగా మార్చిన బిగాల కుటుంబం..**

"బిగాల కృష్ణమూర్తి ఫౌండేషన్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కాలేజీ, పాఠశాల స్థాయిల్లో స్కాలర్‌షిప్‌లు, ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. మిగతా NRI లకు కూడా ఇది ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణ కావాలని కోరుకుంటున్నాను,"అని మహేష్ బిగాల తెలిపారు.

**ప్రభుత్వ ప్రతినిధుల ప్రశంసలు**

పాఠశాలల ప్రారంభోత్సవానికి ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కె.ఆర్. సురేష్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరయ్యారు. భవనాలను పరిశీలించిన వారు, "రాష్ట్రంలోనే ఇంత అద్భుతమైన పాఠశాలను నిర్మించిన బిగాల కుటుంబం స్ఫూర్తిదాయకం," అని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ, ఎంఈఓలు, పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. కొత్త పాఠశాలలు ప్రారంభమవడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

**మాక్లూర్ విద్యా చరిత్రలో కొత్త అధ్యాయం**

విద్యాసేవ పట్ల అంకితమైన బిగాల కుటుంబం కేవలం పాఠశాలలను నిర్మించలేదు —— భవిష్యత్తు తరాలకు ప్రేరణను నిర్మించారు.తండ్రి ఆశయం, తాత చూపిన మార్గం, కుమారుల కృషి కలిసినప్పుడు అది కేవలం భవనం కాదు, అది "విద్యా దేవాలయం".

## సంచలన
## సైబర్ స్కామ్ 3 గంటల్లో రూ.49 కోట్లు స్వాహా

**చట్టం:**

సైబర్ నేరగాళ్లు రోజురోజుకి కొత్త వ్యూహాలు రచిస్తూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. తాజాగా లోన్లు ఇచ్చే ఓ యాప్‌కే బురిడి కొట్టించారు. కేవలం 3 గంటల్లోనే రూ.49 కోట్లు కాజేశారు. ఇంతకీ అసలేం జరిగిందో తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. ఇక వివరాల్లోకి వెళ్తే.. విజ్డమ్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో మనీవ్యూ అనే యాప్ నడుస్తోంది. దీన్ని హ్యాకర్లు టార్గెట్ చేశారు. చైనా, హాంకాంగ్, దుబాయ్, ఫిలిప్పైన్స్, దుబాయ్ నుంచి అంతర్జాతీయ ముఠా ఈ సైబర్ దాడికి పాల్పడింది. ఈ యాప్‌కు చెందిన API కీ ని వినియోగించి కేవలం 3 గంటల్లోనే రూ.49 కోట్లను 653 ఫేక్ ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విషయాన్ని బెంగళూరులో ఉన్న సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (CCB) వెల్లడించింది. అయితే దుబాయ్‌లోని భారత సంతతికి చెందిన వ్యక్తి ఈ దాడికి సూత్రధారని పేర్కొంది. బెళగావిలోని ఇస్మాయిల్ అనే వ్యక్తి నుంచి వర్చువల్ ప్రైవేట్ సర్వర్‌ను కొనుగోలు చేసి.. సైబర్ దాడికి పాల్పడ్డట్లు తెలిపింది. అయితే ఈ కేసులో బెంగళూరుకు చెందిన CCB అధికారులు.. ఇస్మాయిల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే రెండో నిందితుడి పేరుమీదున్న ఫేక్ ఖాతాలకు కూడా డబ్బు బదిలీ అయినట్లు గుర్తించారు. ఇతర బ్యాంకు ఖాతాల్లో రూ.10 కోట్లను అధికారులు ఫ్రీజ్ చేశారు. అలాగే పెన్‌డ్రైవ్‌లు, ల్యాప్‌టాప్‌లను సీజ్ చేశారు. దుబాయ్‌లో ముగ్గురు, హాంకాంగ్‌లో ఇద్దరు అనుమానితులు ఉన్నట్లు గుర్తించారు. వాళ్లని పట్టుకునేందుకు ఇంటర్నేషనల్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొన్నారు.



# మొంథా గండం..
# సీఎం ఆదేశాలు

- **రాష్ట్రంలో భారీ వర్షా లు కురిసే అవకాశం**
- **వాతావరణ శాఖ హెచ్చరించింది**
- **సీఎం రేవంత్ రెడ్డి అలర్ట్ అయ్యారు**
- **ప్రధాన పంటల కొనుగోళ్లపై అప్రమత్తం**
- **కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి**
- **నేడు తెలంగాణపై తీవ్ర ప్రభావం**
- **33 జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**

**తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలర్ట్ అయ్యారు. అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటల కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలనీ, రైతులకు ఎలాంటి నష్టమూ జరగకుండా అన్ని చర్యలూ చేపట్టాలని స్పష్టం చేశారు. తద్వారా రైతుల విషయంలో తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందనే సంకేతాలు ఇచ్చారు. ఐతే.. అధికారులు కూడా అదే విధంగా ఆసక్తి చూపిస్తే.. క్షేత్ర స్థాయిలో రైతులకు వర్ష కష్టాలు తప్పే ఛాన్స్ ఉంది. వర్షా లు పంటలకు నష్టం కలిగించక ముందే కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలనీ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా కొనుగోళ్లు జరగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.**



**చట్టం, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ పూర్తవుతోంది. జిల్లాల్లో ధాన్యం, పత్తి పంటలు చేతికొచ్చాయి. మొక్కజొన్న వంటి ఇతర పంటలు కూడా కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్నాయి. అయితే, భారీ వర్షాలు, మొంథా తుపాను వల్ల పంటలు తడిసిపోయే ప్రమాదం కనిపిస్తోంది. పంటలు తడిశాక పరిహారం ఇచ్చి ఏం లాభం? ముందే కొనుగోళ్లు జరిపితే, రైతులు గట్టెక్కుతారు. కానీ ఇప్పుడు టైమ్ లేదు. మొంతా తుపాను వచ్చేస్తోంది. మంగళవారం తెలంగాణపై కూడా తీవ్ర ప్రభావం చూపేలా ఉంది. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... జిల్లా కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. మంత్రులు, అధికారులతో కలిసి పంటల కొనుగోళ్లు ఎంత వరకూ వచ్చాయో, వర్షాల ప్రభావం ఎలా ఉందో వివరంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాల ప్రకారం, అన్ని జిల్లాల్లో కొనుగోళు కేంద్రాలు 24 గంటల పాటు పనిచేయాలి. తడిసిన పంటలను కూడా కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలనీ, రైతుల ఖాతాల్లో 48 గంటల్లోపు మొత్తం డబ్బు జమ చేయాలని సీఎం సూచించారు. సన్న వడ్లకు ప్రత్యేక బోనస్ (రూ.500) ఇవ్వాలని, ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు రైతు బంధు, ఇతర స్కీమ్‌ల ద్వారా మద్దతు అందించాలని సీఎం ఆదేశించారు. వర్షాల వల్ల పంటలు నష్టపోతే, బీమా క్లెయిమ్‌లు వేగంగా సెటిల్ చేయాలనీ, డ్రోన్‌లు, శాటిలైట్ ఇమేజరీ ద్వారా పరిస్థితిని మానిటర్ చేయాలని సూచించారు.

తెలంగాణలో ఈ ఏడాది ధాన్యం కొనుగోళ లక్ష్యం 75 లక్ష మెట్రిక్ టన్నులు, పత్తి 15 లక్ష బైల్స్, మొక్కజొన్న 5 లక్ష టన్నులుగా నిర్ణయించారు. వర్షాలు, వాతావరణ మార్పుల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ఏడాది కొనుగోళ్లలో ఆలస్యం, మిల్లర్ల సమస్యలు ఎదురయ్యాయి కానీ, ఈసారి డిజిటల్ మానిటరింగ్, బయోమెట్రిక్ వెరిఫికేషన్ ద్వారా సమస్యలు రాకుండా చూస్తామని అధికారులు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో 33 జిల్లా కలెక్టర్లు, సంబంధిత డైరెక్టర్లు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "రైతుల పంటలు సురక్షితంగా కొనుగోలు చేసి, వారి ఆర్థిక భారాన్ని తగ్గించాలి" అని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, "వ్యవసాయ శాఖలోని అన్ని వనరులనూ ఉపయోగించి, వర్షాల ప్రభావాన్ని తగ్గించాలి" అని సూచించారు. ఈ సమావేశం తర్వాత, జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్‌లు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణలో వ్యవసాయం GDPలో 18శాతం భాగం, 60శాతం జనాభా రైతులపై ఆధారపడి ఉంది. వర్షాలు, వాతావరణ మార్పులు పెరుగుతుండటంతో ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది.

## చెంబు పేరు చెప్పి కోటిన్నర కొట్టేశారు..
# మోసపోయిన డాక్టరమ్మ!

**చట్టం:**

అవును... మాయా ప్రపంచంలో అప్పుడప్పుడూ వినిపించే పేర్లలో రైస్ పుల్లింగ్ ఒకటనే సంగతి తెలిసిందే. ఈ విషయంలో చాలామంది అత్యాసలకు లోనయ్యో, అమాయకంగా నమ్మో ఏకంగా రూ.కోట్లలో నష్టపోతుంటారు. ఈ క్రమంలో తాజాగా అలాంటి ఘటన మరొకటి జరిగింది. మహిమ గల చెంబు ఉందని చెప్పి హైదరాబాద్ కు చెందిన లేడీ డాక్టర్ ను బురిడీ కొట్టించింది ఓ గ్యాంగ్. ఈ ఘటనలో ముగ్గురు అరెస్ట్ అయ్యారు. వివరాల్లోకి వెళ్తే... అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయకు చెందిన కొర్రా బంగార్రాజు, కర్నాటి ప్రసాద్, పెందుర్తికి చెందిన వనుము శ్రీనివాస్ లతో కూడిన ఓ ఓ గ్యాంగ్ ఇటీవల హైదరాబాద్ కు చెందిన ఓ లేడీ డాక్టర్ ను కలిశారు. ఆమెతో.. మహిమ గల చెంబు తమ దగ్గర ఉందంటూ మాయ మాటలు చెప్పారు. ఆ చెంబు ఖరీదు రూ.30 కోట్లు అని నమ్మబలికారు. కారణం ఏదైనా.. ఈ విషయాన్ని ఆమె కూడా నమ్మారు.దీంతో ఈ ముగ్గురు డాక్టర్ దగ్గర నుంచి విడతలవారీగా రూ.కోటిన్నర వరకు వసూలు చేశారట. కట్ చేస్తే.. డబ్బులు తీసుకున్న కొన్ని రోజుల తర్వాత ఈ ముగ్గురు సదరు డాక్టర్ కు అందుబాటులో లేకుండాపోయారట. ఈ క్రమంలో ఒకటి కాదు రెండు కాదు సుమారు ఆరు నెలలు గడిచిపోయింది. అయినప్పటికీ ఈ ముగ్గురు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఆ డబ్బులూ తిరిగి ఇవ్వలేదు.అప్పటికి గానీ తాను మోసమోపాయనే విషయం సదరు మహిళా డాక్టర్ కు తెలియలేదు. దీంతో... ఈనెల 19న ఆరిలోవ పోలీసుల్ని ఆమె ఆశ్రయించారు. దీంతో... ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ చెంబు వ్యవహారంలో ఆరిలోవ హెల్త్ సిటీలోని ఓ హోటల్, శ్రీకాంత్ నగర్ లోని ఓ హోటల్ లో లావాదేవీలు జరిగాయని పోలీసులకు ఆధారాలను అందజేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.ఈ నేపథ్యంలో.. ఈ నెల 23న ఆరిలోవ దగ్గర ఇద్దరు నిందితుల్ని అరెస్ట్ చేసిన పోలీసులు.. అనంతరం విమ్స్ మెయిన్ గేటు దగ్గర మరొకర్ని అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. ఈ సందర్భంగా నిందితుల దగ్గర నుంచి సుమారు రెండున్నర లక్షల రూపాయలతో పాటుగా మొబైల్ ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు.



CHATTAM NEWS
చట్టం సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## వరికోత యంత్రం ఢీకొని విరిగిపడ్డ విద్యుత్ స్థంభం



**చట్టం, బోధన్ :** బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాల ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం వారికోత యంత్రం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడింది. సమాచారం అందుకున్న బోధన్ పోలీసులు,మున్సి పాలిటీ సిబ్బంది సహాయంతో వాహనాలకు ఇబ్బంది కలగ కుండా స్తంభాన్ని పక్కకు జరిపారు. అనంతరం మున్సిపల్ ఏఈ శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

## ఆర్టీసీ బస్సు బీభత్సం.. మున్సిపల్ సిబ్బంది నాగమణి మృతి



**చట్టం, బోధన్ :** బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదం ఒక ప్రాణాన్ని బలితీసుకుంది. స్థానిక మున్సిపాలిటీ లో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న భాగ్యం నాగమణి విధులకు వెళ్తుండగా సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బోధన్ నుండి సంగారెడ్డి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగమణిని సహచర సిబ్బంది. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. కాగా మెరుగైన చికిత్సకోసం నిజామాబాద్ లో గల ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. ఈ ఘటనతో మున్సి పల్ సిబ్బంది, ప్రజా సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. మృతురాలికి న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బోధన్ సబ్ కలె క్టర్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. మృతురాలి కుటుబానికి 50 లక్షల రూపాయల ఎక్స్ గ్రేసియా అందించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బోధన్ సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం తరఫున అవసరమైన సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న వ్యక్తుల అరెస్ట్

**నగదు స్వాధీనం-వేములవాడ రూరల్ ఎస్ ఐ వెంకట్రాజం**



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు రామ్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్ మరియు దేవయ్య లను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ ఐ వెంకట్రాజం తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారం మేరకు హన్మాజి పేట్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల ను అదుపులో కి తీసుకొని వారి వద్ద నుండి 40, 210/ రూపాయలు మరియు ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయటం జరిగింది.

## అమరుల స్మరణలో రక్తదానం



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్నేహ బంధు లయన్స్ క్లబ్, రామా యంపేట సిఐ వెంకట రాజాగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాలు భాగంగా రక్తదానం చేయడం మహాదానం అన్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యని అందులో కేసుల్లో తీవ్రంగా గాయపడిన వారికి రక్తదానం తప్పకుండా అవసరం అన్నారు. సర్కిల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి యువత రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రక్తదానం చేయడం వల్ల యువత ఆరోగ్యంగా ఉంటారని యువత నుండి చక్కటి స్పందన ఉందన్నారు. పోలీసు వారోత్సవాల్లో భాగంగా రక్తదానం చేసిన యువతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్, రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెం కటరాజా గౌడ్ పట్టణ ఎస్సై బాలరాజ్, నిజాంపేట ఎస్సై రాజేష్, నార్సింగ్ ఎస్ఐ సృజన, పట్టణ లయన్స్ క్లబ్ సభ్యులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా కల్వకుంట్ల వంశీధర్ రావు జన్మదిన వేడుకలు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లాలో కల్వకుంట్ల వంశీధర్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డా యి. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు "కె.వి.ఆర్ జిందాబాద్" అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొ న్నారు. వంశీధర్ రావు పేరుపై అభిమానులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. వంశీధర్ రావు స్వయంగా కూడా రక్తదానం చేసి, చేసిన ప్రతి కార్యక ర్తకు, అభిమానికి కృతజ్ఞతలు తెలుపుతూ పండ్లు పంపిణీ చేశారు. తర్వాత వంశీధర్ రావు అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నంగునూరు మండలం, చిన్నకోడూరు మండలాల్లో పేద విద్యార్థులకు ఉచిత డ్రైవింగ్ స్కూల్ ద్వారా లైసెన్సులు ఇవ్వడం జరుగుతోంది. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సిద్దిపేటలో విక్టరీ టాకీస్ చౌరస్తా వద్ద కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి. అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధి కోసం వేద సొల్యూషన్ ద్వారా కంప్యూటర్ శిక్షణ, ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు అందిం చేందుకు ప్రయత్నిస్తున్నాం," అని తెలిపారు. అలాగే ఆయన తెలిపారు, "ప్రతి వేసవి సెలవుల్లో నా ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, ఉచిత వసతులు అందిస్తున్నాం. నా మిత్రులు, నా కార్యకర్తలు సమాజ సేవలో ముందుండి కల్వకుంట్ల వంశీధర్ రావు ఫౌండేషన్‌ను బలోపేతం చేస్తున్నారు," అని అన్నారు. వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజాసేవే తన లక్ష్యమని వంశీధర్ రావు పేర్కొన్నారు.

## బీసీలకు 42%రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

**బిఎస్పి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. నవంబర్ 1న హైదరాబాదు లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పై జరిగే ధర్నాను విజయ వంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్‌కోరారు. వారు మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు పెంచే ప్రక్రియల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి అని పే ర్కొన్నారు. బీసీ లు అందరూ ఏకమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్యవర్ గారు మండల కమిషన్ అమలు చేయండి లేదా ప్రధాని గూర్చి కాళీ చేయండి అని కాన్సిరాం ప్రశ్నించారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. బీఎస్పీ ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం సామాజిక న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎవరు ఎంతనో వారి వాటా అంతా అని కాన్సిరాం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి గజ్జల తిరుపతి మౌర్య జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ ముదిరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ళ నరేష్ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ పంగా బాబు నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు కొమ్ము చంద్రం కొండపలకల సంపత్ పోతారం రాజు నాయకులు కరుణాకర్ కనక ప్రసాద్ శ్రీకాంత్ విజయ్ బోయ రాములు పట్టణ అధ్యక్షులు గోపాల ప్రసాద్ పాల్గొన్నారు.

## చిరుతపులి సంచార ప్రాంతాన్ని పరిశీలించిన ఎఫ్. డి. ఓ



**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** కామారెడ్డి ఎఫ్. డి. ఓ పి.వి. రామకృష్ణ, నాగి రెడ్డిపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని లింగంపేట్ మండలం లొంకలపల్లి గ్రామంలో చిరుతపులి సంచరించిన ప్రాంతాన్ని సందర్శించి పరిశీలిం చారు. అటవీ ప్రాంతం నుండి చిరుతపులులు ఎక్కువగా బయటకు రావని, వాటికి అవసరమైన నీటిని సమకూర్చడం జరుగుతోందని ఆయన తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసి, చిరుత తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# వీధి కుక్కల కేసులో రాష్ట్రాలు, యూటీలపై సుప్రీం కోర్టు ఆగ్రహం



**చట్టం మెదక్ ప్రతినిధి :** వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో విఫలమైన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వీధి కుక్కల నియంత్రణకు తాము ఆదేశాలు ఇచ్చి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు స్పందించలేదంటూ ఆయా రాష్ట్రాల తీరుపై సుప్రీంకోర్టు మండిపడింది. తమ ఆదేశాలకు అనుగుణంగా అఫిడవిట్లు సమర్పించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల ప్రధాన కా ర్యదర్శులకు దేశ అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ 2025, నవంబర్ 3న అధికారు లు సుప్రీంకోర్టు ముందు స్వయంగా విచారణకు హాజరుకా వాలని ఆదేశించింది. అధికారులు హాజరు కాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. విధి కుక్కల నియంత్రణలో విఫలమై ప్రపంచదేశాల ముందు భారత్ పరువు తీస్తున్నారంటూ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, వీధి కుక్కలకు సంబంధించి 'ఇన్ ఎ సిటీ హాండెడ్ బై స్ట్రేస్, కిడ్స్ పే ప్రైస్' అనే శీర్షికతో టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రచురించిన కథనా న్ని సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ మేరకు 2025, ఆగస్టు 22న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జంతు జనన నియంత్రణ నిబంధనల ప్రకారం వీధి కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో 2025, అక్టోబర్ 27న ఈ పిటిషన్‌పై న్యాయమూ ర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్.వి. అంజరియాల తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. వీధి కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యల గురించి మెజార్టీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అఫిడవిట్లు సమర్పించలే దు. పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఢిల్లీ మాత్రమే అఫిడవిట్ దాఖలు చేశాయి. దీంతో కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అఫిడవిట్లు సమర్పించడంలో విఫలమైన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఉత్తర్వులను అమలు చేయడంలో ఘోరంగా విఫలమ య్యాయని.. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో దేశం పరువు తీశారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రెండు నెలలు గడిచినా స్పందన లేదని.. అంటే దీని అర్థం ఏంటని ప్రశ్నించింది. తమ ఆదేశాల తర్వాత కూడా దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు నమోదు అవుతూనే ఉన్నాయని, వీధి కుక్కల దాడులపై రోజూ మీడియాలో వార్తలు వస్తున్నా.. అవి అధికా రులకు కనిపించడం లేదా అని ప్రశ్నించింది. మన దేశాన్ని విదేశీయులు కించపరిచేలా మాట్లాడటానికి.. కుక్కల బెడద కూడా కారణమని వ్యాఖ్యానించింది. అనంతరం పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు దేశ అత్యున్నత న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. ఈ మేరకు తదుపరి విచారణ 2025, నవంబర్ 3న అధికారులు సుప్రీంకోర్టు ముందు స్వయంగా విచారణకు హా జరుకావాలని ఆదేశించింది. అధికారులు హాజరుకాకుంటే సీరియస్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించింది.

## నిజామాబాద్‌లో ఈ నెల 29న ప్రైవేట్ రంగ ఉద్యోగ మేళా జిల్లా ఉపాధి అధికారి వెల్లడి



**చట్టం నిజామాబాద్:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 29102025 న ఒక ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి.పి. మధుసూదన్ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఉద్యోగ మేళాకు ప్రముఖ సంస్థలైన ముత్తూట్ ఫైనాన్స్ (Muthoot Finance) మరియు బ్లింకిట్ (Blinkit) కంపెనీల ప్రతినిధులు హాజరై నియామకాలు చేపట్టను న్నారు.

**ఉద్యోగాల వివరాలు:**

| కంపెనీ | ఉద్యోగం | అర్హత |
|---|---|---|
| ముత్తూట్ ఫైనాన్స్ / బ్లింకిట్ | సేల్స్ మేనేజర్ (Sales Manager) | ఏదైనా డిగ్రీ |
| ముత్తూట్ ఫైనాన్స్ / బ్లింకిట్ | కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (CCE) | ఏదైనా డిగ్రీ |
| బ్లింకిట్ | ఇంటర్న్‌షిప్ (Internship) | ఇంటర్ / డిగ్రీ |
| బ్లింకిట్ | పికర్స్ & ప్యాకర్స్ (Pickers & Packers) | ఇంటర్ |

జాబ్ లొకేషన్లు: నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, నిర్మల్, బన్స్వాడ ప్రాంతాలలో ఈ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.

**మేళా వివరాలు:**

ఆసక్తి గల అభ్యర్థులు శివాజీ నగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం నందు 29102025 న ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం లోపల ఈ ఉద్యోగ మేళాకు హాజరుకావాలని అధికారులు కోరారు. అభ్యర్థులు తమ రెజ్యూమ్, బయో డేటా, ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమో మరియు ఫోటో తప్పనిసరిగా తీసుకురావాలి.

**మరిన్ని వివరాల కోసం:**

9959456793, 9948748428, 6305743423 నంబర్లలో సంప్రదించవచ్చు. బి.పి. మధుసూదన్ రావు జిల్లా ఉపాధి అధికారి, నిజామాబాద్.

## ప్రభుత్వ దవాఖానలు, డిగ్రీ కళాశాలలో తీవ్ర లోపాలు

- **ప్రభుత్వ దవాఖానల్లో రోగులపై సిబ్బంది బెదిరింపులు**
- **రామాయంపేట డిగ్రీ కళాశాలలో వసతుల కొరత తీవ్రం**



**చట్టం రామాయంపేట :** రామాయంపేట పట్టణంలో ప్రభుత్వ సేవల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ప్రజలకు ఉచిత వైద్యం, ఉచిత విద్య అన్న నినాదాలు నినాదాలుగా నే మిగిలిపోయాయి. అమలు దిశగా ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు అందించడం కంటే రోగులను బెదిరించే ఘటనలు పెరు గుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో కూడా రోగులను "రేపు రా" అంటూ తిరస్కరించడం, గ్రామస్థులకు చెప్పి చెప్పమని బెదిరించడం వంటి ఘటనలు బయట పడుతున్నాయి. రోగులు ఈ విధమైన ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అటువంటి సిబ్బందిపై డిఎం అండ్ హెచ్ఓ, సూపరింటెండెంట్ కఠిన చర్యలు తీ సుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో రామాయంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించి తమ సమస్యలను వినిపించారు. మూడు సంవత్సరాల క్రితం స్థాపించబడిన ఈ కళాశాలలో ఇంకా మౌలిక వసతులు లేకపోవడం విద్యార్థుల విద్యను ప్రభావితం చేస్తోంది. సుమారు 150 మంది విద్యార్థులు చదువు కుంటున్న ఈ కళాశాలలో కేవలం ఒకటే వాష్‌రూమ్ ఉండడం వల్ల 50 మంది మహిళా విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏబీవీపీ నాయకుడు బండారి ప్రశాంత్ తెలిపారు. తరగతి గదులు సరిపడక సెకండియర్, థర్డ్ ఇయర్ విద్యార్థులు బయట కూర్చునే పరిస్థితి నెలకొనిందని, తాగునీటి సదుపాయం కూడా లేనందున విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అటెండర్లు లేకపోవడం తో, అటెండర్ల పనులను లెక్చరర్లు, విద్యార్థులే చేసుకో వాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఎమ్మె ల్యే మైనపల్లి రోహిత్ రావు, విద్యాధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్య మాలను మరింత ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి అర్జున్, ఆదర్శ్ కళాశాల అధ్యక్షుడు దీక్షిత్, శివ కిరణ్, భరత్, నవదీప్, భరత్ సింగ్, ప్రశాంత్, రోహిత్, సన్నీ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 11 ఫిర్యాదులు స్వీకరించిన సీపీ సాయి చైతన్య



**చట్టం నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా పోలీస్ కా ర్యాలయంలో పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్ర జావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదా రుల నుండి ఆయన 11 అర్జీలను స్వీకరించారు ఫిర్యా దుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం తక్ష ణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు ప్రజావాణిలో వచ్చిన అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ ఐ మరియు సి ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని పోలీస్ కమిషనర్ తెలియజేశారు పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యే లా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని ఆయన వివరించారు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని ఆయన తె లియజేశారు

## రాయితీపై వ్యవసాయ పనిముట్లు



**చట్టం గంగారం :** మహబూబాద్ జిల్లా గంగారం మండలంలో వ్యవసాయ పనిముట్లు రాయితీపై ఇవ్వడం జరుగుతుంది కావున పనిముట్ల కోసం దరఖాస్తులు ఈనెల 30 వ తారీకు వరకు స్వీకరించడం జరుగుతుం ది. ఆసక్తి గల రైతు సోదరులు అవసరమైన పత్రాలను తీసుకొని మీ పరిధిలో గల వ్యవసాయ విస్తీర్ణ అధికారు లను సంప్రదించగలరు. పనిముట్లు చేతి పంపులు పవర్ స్పేయర్లు రోటవేటర్ సీడ్ కామ్ ఫర్టిలైజర్ ట్రాక్టర్ పరి ముట్లు స్ట్రా బేలర్ మొదలగు పరికరాలకు దరఖాస్తులు చేసుకోగలరు. ఎస్సీ ఎస్టీ మహిళ రైతులకు 50శాతం మిగిలిన రైతులకు 40 శాతం రాయితీపై లభిస్తాయి అని గంగారం మండల వ్యవసాయ అధికారీ ఏ వో వేణు యాదవ్ తెలిపారు

## సీఐటీయూ రాష్ట్ర మహాసభలకు విరాళాలు ఇవ్వండి

- **సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్**
- **శివ్వంపేట మండలంలోని శభాష్ పల్లి గ్రామంలో ఇంటింటికి సీఐటీయూ**



**చట్టం, శివ్వంపేట :** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు జయప్రదం చేయడం కోసం కార్మికులు, ప్రజలు విరాళాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. మల్లికార్జున్ పిలుపునిచ్చారు. మెదక్ పట్టణ కేంద్రంలో డిసెంబర్ 7,8,9 మహాసభలు నిర్వహిస్తున్నామని, మహా సభలా నిర్వహణ కోసం సోమవారం శివ్వంపేట మండలం శభాష్‌పల్లి గ్రామంలో ఇంటింటికి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం సీఐటీయూ అన్నారు. తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు మెదక్ జిల్లాలో తొలి సారిగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. స్కీమ్ వర్కర్లతో ప్రభుత్వాలు వెట్టిచకిరి చేయిస్తున్నాయని అన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికుల శ్రమను యాజమాన్యలు దోచుకుంటున్నాయని అన్నారు. ఆటో, హామాలి, భవన నిర్మాణ కార్మికులకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. ఈ మహాసభలలో కార్మికుల సమస్య లను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు, ప్రజలు విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి, తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు ) తూప్రాన్ డివిజన్ కార్యదర్శి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

- **అమర పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి : రూరల్ సీఐ**



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) కార్యక్రమాలలో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హన్మాజీపేట గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం హన్మాజీపేట హైస్కూల్ నుండి ప్రారంభమై గ్రామం అంతా సైకిల్ ర్యాలీగా కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామ ప్రజలు, పోలీసులు దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సబ్ఇన్స్పెక్టర్ వెంకట్రాజం మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలు అందరికీ ప్రేరణగా నిలుస్తాయని, వారిని స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ సిబ్బంది సేవలు ఎప్పటికీ మరువరానివని ఆయన అన్నారు. రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు విధులు నిర్వర్తించిన అమర పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి అని పేర్కొన్నారు. సమాజం ఎప్పటికీ వారి సేవలను గుర్తుంచుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది, హన్మాజీపేట గ్రామ ప్రజలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్లలో MRPS కార్యకర్తల సమావేశం



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** MRPS జాతీయ వ్యవస్థా పక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో MRPS-MSP-VHPS కీలక కా ర్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కన్వీ నర్ యెలగంధుల బిక్షపతి మాదిగ అధ్యక్షత వహించారు. జిల్లా ఇంచార్జ్ పుట్ట రవి మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ CJI న్యాయమూర్తి బి.ఆర్. గవాయి గారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించబోయే దళితుల ఆత్మగౌరవ ర్యాలీని ఘనవిజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రతి మాదిగ నాయకుడు ప్రజలను ఆహ్వానించి, బస్సుల ఏర్పాట్లు చేయాలని సూచించారు. "ఛలో హైదరాబాద్" కార్యక్రమం దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాలని, ప్రతి మాదిగ బిడ్డ తన వంతు కృషి చేయాలని కోరారు. సమావేశం అనంతరం జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద "We Stand With CJI B.R. Gavai" అనే ప్లకార్డులను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్ మాదిగ, MSP జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ, MRPS జిల్లా కో-కన్వీనర్ సావనపెల్లి రాకేష్ మాదిగ, VHPS జిల్లా కన్వీనర్ సడిమెల శోభారాణి, MSP జిల్లా ప్రతినిధి గుండ్రెడ్డి రాజు మాదిగ, రాజన్న సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు బదుగు లింగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు. తదుపరి మండల స్థాయి నాయకులు తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య మాదిగ, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు సోమారపు శరవింద్ మాదిగ, కోనరావుపేట మండల అధ్యక్షుడు కొమ్ము రాజశేఖర్ మాదిగ, వీర్నపల్లి మండల నాయకుడు గద్దరాశి భగవంత్ మాదిగ, రుద్రంగి మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ మాదిగ, గంబీరావుపేట మండల ప్రధాన కార్యదర్శి నరేష్‌వర్మ మాదిగ, ఉపాధ్యక్షుడు ప్రశాంత్ మాదిగ పాల్గొన్నారు. సీనియర్ నాయకులు అందె సామియేలు మాదిగ, గుండెల్లి దేవరాములు మాదిగ, ఆవునూరి లచ్చన్న మాదిగ, మల్లారం రాజయ్య మాదిగతో పాటు ఇతర మండలాల నాయకులు కూడా ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.

## కార్తీకమాసం మించిన మాసం మరొకటి లేదు

- **భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**



**చట్టం ప్రతినిధి, సిద్దిపేట (దుబ్బాక) :** కార్తీక మాసం మొదటి సోమవారం శుభ సందర్భంగా అద్దాల మందిరం వద్ద శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో మహాశివునికి పంచామృత అభిషేకాలు రామకోటి రామరాజు దంపతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, సంస్థ అధ్యక్షులు రామకోటి రమరాజు మాట్లాడుతూ పరమశివునికి అత్యంత ప్రీ తికరమైన మాసం కార్తీకమాసం అని అన్నారు. ఈ కార్తీకమాసంలో భక్తులందరు శివనామ స్మరణలో మునిగితెలుతారన్నారు. పురాణ కాలం నుంచి కార్తీ కమాసానికి ఒక విశిష్టత సంతరించుకుందన్నారు. కార్తీకమాసం మహిమాన్వితమైన మాసంగా అభివర్ణించారు. ఈ మాసమంతా పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వానబోజనాలు ఇలా భక్తి పారవశ్యంతో మునిగిపోతారన్నారు. కార్తీక మాసానికి సమానమైన మాసం లేదని అన్నారు. శ్రీ మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేదని, వేదముతో సమానమైన శాస్త్రము లేదని తెలిపారు. గంగతో సమానమైన తీర్థము లేదని, ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు.

